సాక్షి తిరుపతి

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



ఏడు గంగల కొలువుకు..

శ్రీకాళహస్తిలో ఏడు గంగల కొలువుకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. - 8లో



25 కిలోల గంజాయి స్వాధీనం

25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు నాయుడుపేట డీఎస్పీ తెలిపారు. - 8లో



కలెక్టరేట్‌లో 'ప్రకృతి వ్యవసాయం'!

కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రకృతి సిద్ధంగా పండిన కూరగాయలు, వర్మీకంపోస్టు ఎరువులను విక్రయించారు. - 8లో

న్యూస్‌రీల్

జర్మనీ పర్యటనలో మహిళా వర్సిటీ వీసీ



వీసీ ప్రొఫెసర్ వీ.ఉమ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వీ.ఉమ జర్మనీ పర్యటనకు బయలుదేరారు. సోమవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు జర్మనీలో 'ఉన్నత విద్య, సైన్స్ కో–ఆపరేషన్ సంస్థల సహకారం' అనే అంశంపై జరగనున్న యాత్రలో ఆమె పాల్గొననున్నారు. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మన్ విజిటర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆ ప్రాంత ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, టెక్నాలజీ వినియోగం, ఉన్నత విద్య, ఉపాధి రంగం వంటి అంశాలపై నిశితంగా పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార పరిశోధన, విద్యార్థినులు, అధ్యాపకుల మార్పిడి, డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు, సాంస్కృతిక సహకారాలకు సంబంధించి జర్మన్ విద్యా సంస్థలతో భాగస్వామిగా కొనసాగేందుకు సహకరిస్తుందని తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 68 అర్జీలు



ఎస్పీ సుబ్బారాయుడుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి 68 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు వెల్లడించారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

21 నుంచి డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో డిగ్రీ అన్ని కోర్సులకు సంబంధించి తొలి ఏడాది ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21 నుంచి జనవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ తెలిపారు. ఇప్పటికే పరీక్షల టైంటేబుల్‌ను ఉమ్మడి జిల్లాలోని అన్ని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు పంపామని పేర్కొన్నారు. అలాగే ఈనెల 4 నుంచి జరగుతున్న డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి హైపవర్ ఇన్‌స్పెక్షన్ కమిటీ నివేదిక ప్రకారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు వెల్లడించారు.

వైద్య అధ్యాపకులకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల వైద్య అధ్యాపకులకు, నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' అనే అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఎస్వీ వైద్య కళాశాల మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం, తమిళనాడు చెందిన వేలూరు సీఎంసీ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ పాల్గొని ప్రసంగించారు. 30 మంది వైద్య అధ్యాపకులకు వైద్యవిద్య బోధనలో నూతన పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జిరవిప్రభు, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కిరీటి, సీఎంసీ వేలూరు వైద్య కళాశాల పర్యవేక్షకులు డాక్టర్ రమ్య, జనరల్ మెడిసిన్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ నిండింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 73,107 మంది స్వామివారిని దర్శించుకోగా 22,721 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పక్షుల భూతల స్వర్గంగా పేరు ప్రఖ్యాతలున్న పులికాట్ సరస్సులో పర్యాటక రంగం పడకేసింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు నీటి సరస్సుగా పేరుగాంచినా ప్రభుత్వ దృష్టిని ఆకర్షించలేకపోయింది. శిలాఫలకాలు తప్ప ఇక్కడ అభివృద్ధి ఊసే లేకుండా పోయింది. సరస్సు ముఖద్వారాల వద్ద పూడిక తీత సీఎం చంద్రబాబు గారడీ మాటలకు దిక్సూచిగా నిలిచింది. ఇక్కడకొచ్చే పర్యాటకులు, పక్షి ప్రేమికులకు కనీస వసతులు లేక నరకం అనుభవించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.



ప్రకృతి అందాల హరివిల్లు పులికాట్ సరస్సు



పులికాట్ సరస్సులో ఆహారవేటలో ఉన్న ఫ్లెమింగోలు



ఫలకాలే.. వినోదం కలే!

పర్యాటకానికి ఆమడ దూరంలో పులికాట్ సరస్సు

- శిలాఫలకాలు తప్ప అభివృద్ధి శూన్యం
- వనరులున్నా ప్రయత్నాలు విఫలం
- నిద్రావస్థలో పర్యాటకశాఖ
- పట్టించుకోని పులికాట్ వన్యప్రాణి సంరక్షణా శాఖ

సూళ్లూరుపేట : ఆంధ్రా–తమిళనాడు సరిహద్దుల్లో సుమారు 620 చ.కి.మీ విస్తీర్ణంలో పులికాట్ సరస్సు విస్తరించి ఉంది. దీన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పడుతున్న అడుగులన్నీ శిలాఫలకాలతోనే సరిపోతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్నప్పుడు దీనికి సరైన గుర్తింపు లేకుండా పోయింది. ఇప్పుడు తిరుపతి జిల్లాలో చేరింది. అన్ని పర్యాటక ప్రాంతాలతో పాటు పులికాట్ సరస్సును పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తే మంచి గుర్తింపు లభిస్తుంది.

అన్నీ తళుకు బెళుకులే!

ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఉప్పునీటి సరస్సుగా పులికాట్ సరస్సుకు పేరుంది. పులికాట్ సరస్సుకు వచ్చే విదేశీ వలస పక్షుల జాతుల్లో ఫ్లెమింగో (సముద్రపు రామచిలుక) పేరుతో 2001 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రవేశపెట్టారు. 2013లో టూరిజం క్యాలండర్‌లో చేర్చిన తర్వాత 2014లో స్టేట్ మెగా ఫెస్టివల్‌గా చేర్చి ఏటా పండుగను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా డిసెంబర్ లేదా జనవరిలో మూడు రోజుల పాటు పండుగను నిర్వహిస్తుంటారు. ఎగ్జిబిషన్ స్టాల్స్, సినీ తారల తళుకు బెళుకులతో పండుగను నిర్వహించి వదిలేస్తూ వచ్చారు. పులికాట్ సరస్సును కాపాడుకునే దిశగా మాత్రం పాలకులు ఆలోచన చేయలేకపోయారు. తడ మండలంలో తడ, భీములవారిపాళెం పడవల రేవు వద్ద బోట్ షికార్ చేయడానికి అనువుగా ఉన్నా పక్షుల పండుగ జరిగే మూడు రోజులతోనే సరిపెట్టేస్తున్నారు. పులికాట్ సరస్సుకు నీళ్లు వచ్చినపుడు సూళ్లూరుపేట–శ్రీహరికోట, అటకానితిప్ప– పేర్నాడు, అటకానితిప్ప–వేనాడుకు వెళ్లే రోడ్లలో పక్షుల గుంపులు చేరి ప్రకృతి ప్రేమికులను ఆహ్లాదపరుస్తున్నాయి. పర్యాటకులు వస్తే వారు మంచి భోజనం చేయాలన్నా, పిల్లలు సరదాగా ఆడుకోవాలన్నా సౌకర్యాలు లేవు.



తలుపులు తెరుచుకోని అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం



దొరవారిసత్రం మండలం, నేలపట్టులో శిథిలమైపోతున్న ఏపీ టూరిజం గెస్ట్‌హౌస్

శిలాఫలకాలే తప్ప అభివృద్ధి లేదు

పులికాట్ సరస్సును పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాంతంలో పక్షుల సందర్శనకు దొరవారిసత్రం మండలం, నేలపట్టు ప్రాంతం అనువుగా ఉంది. అలాగే పులికాట్ సరస్సు మధ్యలో అటకానితిప్పలో పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఉంది. పులికాట్ సరస్సును వీక్షించి అందులో పడవ షికార్ చేసేందుకు తడ, భీములవారిపాళెం రేవులు ఎంతో అనువుగా ఉన్నాయి. 1992లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి భీములవారిపాళెం పడవల రేవులో టూరిజం గెస్ట్ హౌస్ నిర్మించేందుకు శిలాఫలకం వేశారు. ఆ తర్వాత 1994 నుంచి 2004 దాకా అధికారంలో ఉన్న టీడీపీ 2001లో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రవేశపెట్టింది. తడ, దొరవారిసత్రం మండలాల్లో ఏపీ టూరిజానికి సంబంధించిన పున్నమి రెస్టారెంట్లు ఏర్పాటు చేసింది. నేలపట్టులో టూరిజం గెస్ట్‌హౌస్ నిర్మించి..విస్మరించింది. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరాయి. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనం రామనారాయణరెడ్డి పర్యాటకశాఖా మంత్రిగా 2008లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సెంటర్, హరిత ఎకో టూరిజం రిసార్ట్స్ నిర్మించాలని చెన్నై సవేరా హోటల్స్ వారి సాయంతో రెండు శిలాఫలకాలు వేసి వదిలేశారు. పులికాట్ సరస్సును అభివృద్ధి చేయడానికి కావాల్సిన నిధులు మంజూరు చేయడం వంటి పనులను టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయి. పులికాట్ సరస్సు ముఖద్వారాలను పూడిక తీయిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఊదరగొట్టడమే తప్ప చేసింది లేదు. గతంలో రూ.48 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటనలు గుప్పించారు. 2017, 2018లో మరోమారు రూ.48 కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పి తప్పించుకున్నారు. ఈ సారి ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఇటీవల కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంటేశ్వర్ ప్రకటించారు. ఆలోపు అయినా పులికాట్ ముఖద్వారాల పూడిక తీత పనులు తెరమీదకు వస్తాయోలేదో.



భీములవారిపాళెం పడవల రేవు వద్ద మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి వేసిన శిలాఫలకం



పిచ్చి మొక్కలతో నిండిపోయిన బర్డ్స్ వ్యూ పాయింట్



కుదిరి–అటకానితిప్పకు మధ్యలో బర్డ్స్ వ్యూ పాయింట్‌లో పగిలిపోయిన బెంచీలు



టూరిజం గెస్ట్‌హౌస్ నిర్మాణానికి భీములవారి పాళెం పడవల రేవు వద్ద వేసిన శిలాఫలకం

వీరు ఉన్నారా?

విదేశీ వలస విహంగాల గురించి తగిన ప్రచారాన్ని కల్పించాల్సిన పులికాట్ వన్యప్రాణి సంరక్షణా విభాగం అధికారులు ఉన్నారా.. లేరా..? అన్నట్టుగా పని చేస్తున్నారు. పక్షి ప్రేమికులకు సమాచారాన్ని ఇచ్చే దిక్కులేకుండా పోయింది. సూళ్లూరుపేట–శ్రీహరికోట రోడ్డులో పులికాట్ సరస్సుకు ముఖద్వారంగా ఉన్న కుదిరి గ్రామం వద్ద పక్షుల సమాచార కేంద్రం ఉంది. అందులో ఏనాడూ సిబ్బంది కూర్చుని సమాచారాన్ని అందించిన దాఖలాల్లేవు. అటకానితిప్పలో పర్యావరణ విజ్ఞానకేంద్రం ఉన్నా దాని గురించి ప్రచారం లేకపోవడంతో ఈ కేంద్రం గేట్లు తెరుచుకున్న పాపాన పోలేదు. పులికాట్ సరస్సులో కూర్చుని పక్షులను వీక్షించేందుకు శ్రీహరికోట రోడ్డులో వ్యూపాయింట్లును ఏర్పాటు చేశారు. కానీ వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబులు వాటిని ధ్వంసం చేశారు.



టిప్పర్లు వెళ్తుండగా లేస్తున్న దుమ్ము

దుమ్ము.. ఎగజిమ్ము

చిల్లకూరు మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు నుంచి చింతవరం వరకు ఉన్న 23 కి.మీ రోడ్డు దుస్థితికి చేరింది. ఇటీవల ఫెంగల్ తుపాను కారణంగా మరింత అధ్వానంగా మారింది. సాగరమాల కాంట్రాక్టు పనులు చేసే వారు ఇదే రోడ్డుపై రాత్రి, పగలు తేడాలేకుండా భారీ టిప్పర్లు తిప్పుతున్నారు. వీటి కారణంగా దుమ్ము రేగుతోంది. రోడ్డుకు ఇరువైపులా నివసించే కుటుంబాలు దుమ్ముతో అల్లాడి పోతున్నాయి. ఇళ్లల్లో ఉండే ప్రతి వస్తువుపై దుమ్ము పేరుకుపోతోంది. గ్రామాలలో ఇప్పటికే చాలా మంది శ్వాసకోశ వ్యాధులబారినపడి అల్లాడుతున్నారు. సిలికా టిప్పర్లు తరలించే సమయంలో రోడ్డుపై దుమ్ము లేయకుండా నీళ్ల చల్లే వారు. కానీ ఇప్పుడు అలాంటిదేదీ చేయకపోవడంతో వాహనదారులు, రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు ముప్పుతిప్పలు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు సోమవారం టిప్పర్లను అడ్డగించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి దుమ్ము లేయకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. – చిల్లకూరు

కలెక్టరేట్ వద్ద ధర్నాలు, నిరసనలు

- గ్రీవెన్స్‌కు 183 అర్జీలు
- గడువు లోపు పరిష్కరించాలన్న కలెక్టర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక వద్ద ధర్నాలు, నిరసనలు చోటు చేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 183 అర్జీలు రాగా..అందులో 108 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గ్రీవెన్స్‌లో అర్జీదారులకు వసతులు కల్పించాలని కోరారు. ఆయనతోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో రూ.10 లక్షల నష్టం

చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టిచర్ల పంచాయతీ, బొంతనైన వారిపల్లికి చెందిన పలువురు రైతులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఓ వినతిపత్రాన్ని అందించారు. ఏనుగల దాడిలో తమ గ్రామంలోనే రూ.10 లక్షలకు పైగా నష్టం జరిగిందని, ప్రధానంగా టమాట, వంగ, వరి తదితర పంటలను నాశనం చేశాయని వాపోయారు. ఆర్థిక సాయం చేయాలంటూ రైతులు మల్లేశ్వర్, చెంగల్‌రాయల్ అభ్యర్థించారు. వారికి అండగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు, రైతు సంఘం కో–కన్వీనర్ బీ.శ్రీనివాసులు నిలిచారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

జీతాలు అడిగితే...తొలగించారు

మాది శ్రీకాళహస్తి. 24 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు 2020 నుంచి పనిచేస్తున్నాం. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశాం. ఈ ఏడాది నవంబర్ 15వ తేదీ వరకు పనిచేశాం. అయితే ఆరు నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. మా జీతాలు ఇవ్వాలని గట్టిగా అడగడంతో తొలగించారు. ఇది న్యాయమా?.. అంటూ కార్మికులు నేతాజీ, కీర్తి, వనజ, జ్ఞానమ్మ, చిన్న అల్లురయ్య, గురవమ్మ, వెంకటేష్ తదితరులు ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

మా ఆశ్రమానికి అండగా ఉండండి సర్



నేను దివ్యాంగురాలను. సేవా భావంలో శ్రీలక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పేడు మండలంలోని వికృతమాలలో నిర్వహిస్తున్నాను. మా వద్ద 40 మంది ఉన్నారు. వారిలో వృద్ధులు, మానసిక, శారీరక దివ్యాంగులు, కంటిచూపు లేని వారు, వినికిడి లోపంతో బాధపడుతున్న వారు ఉన్నారు. మాకు సొంత భవనం లేదు. అద్దె భవనంలో నడుపుతున్నాం. చుట్టుపక్కల వారు తమకు ఇబ్బందిగా ఉందని ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారు. మానసిక రోగులను ఎక్కడకి తీసుకుని పోవాలో తెలియడం లేదు. వారికి ఆధార్ కార్డులు లేవు. మరోవైపు ఆశ్రమాన్ని అద్దె భవనంలో కాకుండా శాశ్వత భవనంలో నిర్వహించడానికి చిన్నపాటి స్థలం కేటాయించాలి.

–పీ.సైదమ్మ, దివ్యాంగురాలు

ఆ గూండాలను అరెస్ట్ చేయండి!

- ప్రొఫెసర్‌పై దాడిని ఖండిస్తూ కదం తొక్కిన ప్రజాసంఘాలు
- నిందితులపై చర్యలు తీసుకోవాలని నినదించిన నేతలు
- ధర్నాలు, నిరసనలతో హోరెత్తిన వర్సిటీ ప్రాంగణం



వర్సిటీ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రాంగణం నిరసనలతో హోరెత్తింది. వారం క్రితం వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ చెంగయ్యపై బజరంగ్దళ్ నేతలు కొందరు దాడిచేసిన ఘటనపై ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆ గూండాలను వెంటనే అరెస్టు చేయాలని వర్సిటీ ఎదుటగల అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి ఏడీ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వీసీ అప్పారావుతో సమావేశమై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ యూనివర్సిటీలో ఇంతటి దారుణం జరిగి వారం రోజులు గడుస్తున్నా రౌడీలను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. గుండాలకు మద్దతుగా బీజేపీ నాయకులు నిలబడ్డారని, వారి ఫిర్యాదు మేరకు ప్రొఫెసర్ పైనే కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని వాపోయారు. బజరంగ్దళ్ నాయకులను హరే రామ హరే కృష్ణ గుడిలో సన్మానించిన రామదాసుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం సమాధానం చెప్పాలి

వర్సిటీలో దళితులకు రక్షణ కరువైందనడానికి ఇంతకన్నా తార్కారణమేమిటని ప్రశ్నించారు. ఇదే యూనివర్సిటీలో చదివిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ధర్మాన్ని కాపాడతామని గొంతు చించుకునే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ సమస్యపై ఎందుకు స్పందించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎస్పీకి ఫిర్యాదు

అనంతరం తిరుపతి జిల్లా ఎస్పీకి ప్రజాసంఘాల నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్పీ స్పందిస్తూ విచారణ చేసి తప్పక దోషులను అరెస్టు చేస్తామని ఇప్పటికే కేసు నమోదు చేశామని తెలిపారు. ఆర్పీఐ దక్షిణ భారత అధ్యక్షులు అంజయ్య, విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివన్, టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు ప్రసాదరావు, అధ్యాపకులు గోపి, వీఎస్‌కే నాయకులు రమేష్, బీఎస్పీ నాయకులు విజయ కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సీపీఎం నగర కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్

• యువకుడి మృతి



ప్రమాద స్థలంలో తులసీరావు మృతదేహం

తడ: ఏపీఐఐసీ మాంబట్టు పారిశ్రామిక వాడలో సోమవారం ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ కొండపనాయుడు కథనం.. సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేట, పాలవల్లివారి వీధికి చెందిన తులసీరావు(33) మాంబట్టు సెజ్‌లోని అపాచీ బూట్ల పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి డ్యూటీకి బయలు దేరాడు. విధులకు వెళ్లకుండా అక్కడి నుంచి మిత్రునికి చెందిన బైక్‌పై ఉదయం 9 గంటల సమయంలో తిరిగి సూళ్లూరుపేటకు బయల్దేరాడు. సెజ్ పరిధిలోని వాల్కరో చెప్పుల పరిశ్రమ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టి రోడ్డుపై బోల్తాపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని భార్య సాయిప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

క్విజ్ పోటీలకు నేడే ఆఖరు



ముఖాముఖిలో పాల్గొన్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ యువజన దినోత్సవం (ఎన్‌వైసీ-2025) సందర్భంగా వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ పేరుతో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మంగళవారం అర్ధరాత్రి 12 గంటలతో ముగియనుంది. ఈ సందర్భంగా వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర గవర్నర్ కార్యాలయం వీసీలతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ పరిధిలోని అన్ని కళాశాల విద్యార్థులు క్విజ్ పోటీలలో పాల్గొనే విధంగా యాజమాన్యాలు చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్స్‌కు సమాచారాన్ని చేరవేశారు.

అంతా ఇన్‌చార్జ్‌ల మయం

- గాడితప్పుతున్న ఆర్టీసీ
- పడిపోతున్న ఆదాయం

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా ఆర్టీసీ ఇన్‌చార్జుల మయమైంది. ఆర్టీసీ చరిత్రలో ఈ స్థాయిలో ఇన్‌చార్జుల పాలన కొనసాగలేదని పలువురు వెల్లడిస్తున్నారు. ప్రయాణికులకు వసతుల లేమితోపాటు రాబడి గణనీయంగా తగ్గుతోందని బాహాటకంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు కీలకమైన పోస్టులన్నీ ఇన్‌చార్జుల చేతుల్లోనే నడుస్తున్నాయి. కోవిడ్ తర్వాత 2021 నుంచి రాబడిలో రాష్ట్రంలో తిరుపతి జిల్లా టాప్‌లో ఉండేది. రోజూ రూ.1.6 కోట్ల నుంచి రూ.1.7 కోట్ల మేరకు వచ్చేది. అయితే పర్యవేక్షణ లేమికి తోడు పరిపాలన మొత్తం ఇన్‌చార్జ్‌లకే అప్పగించడంతో రోజువారి రాబడి తగ్గిపోతోంది. గత నవంబర్ 25న రూ.1.59 కోట్లు రాగా..డిసెంబర్ 6న రూ.1.33 కోట్లకు పడిపోయింది. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.



తిరుపతి బస్టాండ్

అక్కడ ఒక రోజు.. ఇక్కడొక రోజు



జిల్లా ఆర్టీసీని నడిపించాల్సిన ఉద్యోగి డీపీటీవో జగదీష్ చిత్తూరు జిల్లా డీపీటీవోగా పని చేస్తున్నారు. తిరుపతి డీపీటీవోగా పనిచేస్తున్న చెంగల్‌రెడ్డి ఈడీగా పదోన్నతిపై విజయవాడకు గత అక్టోబర్‌లో వెళ్లారు. అప్పటి నుంచి చిత్తూరు డీపీటీవోకు తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఆయన ఒక రోజు చిత్తూరులో.. మరొకరోజు తిరుపతిలో ఉంటున్నారు. ఈ క్రమంలో జిల్లాపై పట్టుసాధించలేకపోతున్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు.

తిరుమల డీఎంకు డీసీటీఎంగా బాధ్యతలు



తిరుమల డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న విశ్వనాథం డీసీటీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తిరుమల డిపో మేనేజర్‌గా పనిచేయడమే కీలకం. అయితే ఆయనకు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వడంపై పలు విమర్శలు వస్తున్నాయి. డీసీటీఎంగా పనిచేస్తున్న భాస్కర్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో ఆ పోస్టును విశ్వనాథం కట్టబెట్టారు.

రెండు డిపోలకు ఒక్కరే మేనేజర్



తిరుపతి డీఎం బాలాజీకి శ్రీకాళహస్తి డీఎం బాధ్యతలు అప్పగించారు. ఈ రెండూ టెంపుల్ సిటీలు కావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గత సెప్టెంబర్‌లో శ్రీకాళహస్తి డీఎం రాజవర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి తిరుపతి డీఎం బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఒక్క రోజు తిరుపతిలో.. మరొక రోజు శ్రీకాళహస్తిలో ఉంటున్నారు.

ఇన్‌చార్జ్ పర్సనల్ ఆఫీసర్‌గా సహజాద్

చిత్తూరు జిల్లా పర్సనల్ ఆఫీసర్(పీవో)గా పనిచేస్తున్న సహజాద్‌ను తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ పీవో బాధ్యతలు అప్పగించారు. తిరుపతి జిల్లా పీఓగా పనిచేస్తున్న పార్థసారథి గత మేలో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి చిత్తూరు పీవోకు తిరుపతి పీవో ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయనే ఇక్కడ ఒకరోజు అక్కడ ఒక రోజు ఉండడంతో పరిపాలనపై పట్టు సాధించలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

తిరుపతి జిల్లా ఆర్టీసీ సమాచారం

11	డిపోలు
802	సర్వీసులు
100	విద్యుత్ బస్సులు
4,256	ఉద్యోగులు
5.2 లక్షలు	రోజు వారి ప్రయాణికులు
రూ.1.6 కోట్ల నుంచి రూ.1.7 కోట్ల వరకు	రోజు వారి రాబడి
1	ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్
504	ఆర్టీసీ దుకాణాలు
రూ.44 కోట్లు	రాబడి
రూ.5 కోట్లు	కార్గో రాబడి

ఏటీఎంకు కార్గోతోపాటు చెన్నై బస్టాండ్ బాధ్యతలు



తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం)గా పనిచేస్తున్న రామచంద్రనాయుడుకు కార్గో ఇన్‌చార్జి బాధ్యతలతోపాటు చెన్నై బస్టాండ్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన మూడు పోస్టులకు చెందిన పనులు చూడాల్సి ఉంది. ఏటీఎంగా తిరుపతి బస్టాండ్‌లోని శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు బస్టాండ్లలో వసతులు చూడాలి. అంతేకాకుండా 126 దుకాణాలను పర్యావేక్షణ చేయాలి. అయితే చెన్నై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టు రెండేళ్ల క్రితం ఖాళీ అయితే ఈయనకే అప్పగించారు. ఆ తర్వాత కార్గోకు సంబంధించి తిరుపతి కమర్షియల్ అధికారి సురేంద్రబాబు గత మే నెలలో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కార్గో బాధ్యతలు కూడా రామచంద్రనాయుడుకే అప్పగించారు. దీంతో పలు సమస్యలకు పరిష్కారం లేకుండా పోతోంది.

బకాయిలు విడుదల చేయండి



జేసీకి వినతిపత్రాన్ని ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

తిరుపతి అర్బన్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, జీఓ నం.77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కే.శివారెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. వారం దరికీ బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టండి

విద్యార్థుల చదువులపై అధికారులు శ్రద్ధ పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి, ఉపాధ్యాక్షులు బాల డిమాండ్ చేశారు. ఆ మేరకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఎస్టీ గురుకుల పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ అధ్యాపకులు సమ్మెలో ఉన్నారని తెలిపారు. దీంతో పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ప్రత్యామ్నాయంగా అధ్యాపకులను ఏర్పాటు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్



గంజాయి కేసులో నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్: అక్రమంగా రవాణా చేస్తున్న 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. నాయుడుపేట పోలీస్ డివిజన్ కార్యాలయంలో సీఐ బాబీతో పాటు ఎస్ఐలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. నాయుడుపేట సీఐ సారథ్యంలో ఎస్ఐలు, ఐడీ పార్టీ పోలీసులతో కలిసి గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు నిఘాపెట్టినట్టు వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం, ఆత్మకూరు పట్టణానికి చెందిన బొద్దుల వెంకటేష్, పండాలి చక్రధరిని అదుపులోకి తీసుకుని, వారి బ్యాగుల్లో ఉన్న కొంత గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. విచారణలో నర్సీపట్టణానికి చెందిన ప్రకాష్ రాజ్, బాబీ వద్ద నుంచి గంజాయిని భారీ మొత్తంలో వెంకటేష్, చక్రధరిలు కొనుగోలు చేసినట్టు తెలిసిందన్నారు. వీరు నేరుగా నాయుడుపేటకు వచ్చి పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీకి చెందిన ఏ.వెంకయ్య, ఎన్.వెంకటసుబ్బయ్య, ఆత్మకూరు మీరమ్మ, పెద్దగడపల వెంకటమ్మకు హోల్‌సేల్‌గా విక్రయించేవారన్నారు. వీరు నలుగురూ నాయుడుపేట పట్టణంలోని పలు ప్రాంతాలల్లో గంజాయిని అక్రమంగా విక్రయించేవారని తెలిపారు. గంజాయి ముఠాకు సంబంధించి గుంటూరుకు చెందిన ఇద్దరితో పాటు నాయుడుపేటకు చెందిన నలుగురిని మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు వివరించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.3 లక్షలకు పైగా విలువ చేసే 25 కిలోల గంజాయి, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పట్టుకోవాల్సి ఉందన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, బాబీతో పాటు ఎస్ఐలు భవానీలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, ఏఎస్ఐ షేక్ షాహిదా, హెడ్ కానిస్టేబుల్ కోండురు రామ్మోహన్‌రాజు, కే.నావూరయ్య, కానిస్టేబుల్ షేక్ సుహేల్, దారా భానుతేజ, బండి పోలయ్య, చందన, కే.మరళి, హెచ్‌జీ సుప్రజ తదితరులను డీఎస్పీ అభినందించారు.

తప్పుడు సంతకాలతో అక్రమ మైనింగ్

- మా క్వారీలోకి వెళితే అడ్డుకున్న శేఖర్‌బాబు అనుచరులు
- వారికి చంద్రగిరి ఎమ్మెల్యే సహకారం
- నేను కూడా టీడీపీ వాడినే.. అయినా వదల్లేదు
- నా ప్రాణానికి వారి నుంచి ముప్పు
- గ్రానైట్ వ్యాపారి భానుప్రతాప్



సమావేశంలో మాట్లాడుతున్న భాను ప్రతాప్

చిత్తూరు రూరల్ : తప్పుడు సంతకాలతో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని ఎస్ఆర్ పురం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు భానుప్రతాప్ ఆరోపించారు. చిత్తూరు గ్రానైట్ క్వారీ సంఘం నాయకుడు శేఖర్ బాబు నుంచి తన ప్రాణానికి ముప్పు ఉందని ఆయన వాపోయారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఆర్‌పురం మండలం దుర్గరాజాపురంలో 1.980 హెక్టార్ల క్వారీ తనకు మంజూరు అయిందన్నారు. మైనింగ్ కార్యాలయంలో ఆఫీస్ పనులు చేసేందుకు శేఖర్ బాబుకు తాను ఇచ్చిన జీపీఏని ఫోర్జరీ చేసి అక్రమంగా మైనింగ్ చేశారని తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా దాదాపు 1000 బ్లాక్‌ల రాయిని మైనింగ్ చేసి ఎగుమతి చేశారని ఆరోపించారు. అంతేకాకుండా పక్కనే ఉన్న మరొక క్వారీలో అనుమతి లేకుండా 70 సెంట్లలో దోచేశారన్నారు. రెండు వారాల క్రితం క్వారీలో పనిచేయడానికి వెళ్లిన తనను శేఖర్ బాబు అనుచరులు అడ్డుకున్నారని వాపోయారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదన్నారు. శేఖర్ బాబుకు చంద్రగిరి ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని, తాను కూడా టీడీపీకి చెందిన వాడినే అయినా తనకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్రస్తుతం క్వారీలో ఉన్న వాహనాలను, యంత్రాలను తొలగించి తనకు క్వారీని అప్పగించి, తాను మైనింగ్ చేసుకునేందుకు భద్రత కల్పించాలని విన్నవించారు.

భానుప్రతాప్‌వి తప్పుడు ఆరోపణలు

దుర్గరాజాపురం క్వారీ వ్యవహారంలో తనపై భానుప్రతాప్ అనే వ్యక్తి చేసిన ఆరోపణలు నిరాధారం అని గ్రానైట్ వ్యాపారి శేఖర్ బాబు స్పష్టం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

శిక్షణా తరగతులకు ఇది సమయం కాదు

పెద్దపంజాణి: ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎస్ రీడర్‌షిప్ శిక్షణా తరగతులను తక్షణం రద్దు చేయాలని ఎస్టీయూ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులను నిర్వహించాలని సూచించారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు జరపాలని, ఇటువంటి సమయంలో శిక్షణా తరగతులు నిర్వహించడం భావ్యం కాదన్నారు. చాలా స్కూళ్లలో ఒకరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, ఒక ఉపాధ్యాయుడు శిక్షణకు వెళ్తే మరొకరు పరీక్షలు ఎలా నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి మోహన్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సరెండర్ లీవుల బకాయిలు, పెండింగ్‌లోని పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాల ఫైనల్ పేమెంటును వెంటనే విడుదల చేయాలన్నారు. అదేవిధంగా 12వ పీఆర్‌సీకి సంబంధించి వెంటనే కమిషనర్‌ను నియమించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతం ప్రకటించాలని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశా రు. ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కమిటీ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల ఆశలపై నీళ్లు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం కార్మికుల ఆశలపై నీళ్లు చల్లిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, కే.రాధాకృష్ణ మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద సోమవారం ఏఐటీయూసీ నేతృత్వంలో వారు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలల్లో ఆయాలు, గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను నిలువునా ముంచేసిందన్నారు. వారి వేతనాలు పెంచకుండా చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. రేణిగుంట, దామలచేరువు పంచాయతీ కార్మికుల జీతాల నుంచి పీఎఫ్ డబ్బులు పట్టుకుంటున్నా వారి ఖాతాల్లో జమ కావడంలేదని ఆరోపించారు. వారికి న్యాయం జరిగేవరకు పోరాడుతామని తేల్చిచెప్పారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన డీపీఓ సుశీలాదేవిని ఆదేశించారు

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

- పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ఘటన



మృతురాలు శ్రావణి

చంద్రగిరి: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి కోదండరామాపురం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం.. పాకాల మండం, కే.వడ్డేపల్లికి చెందిన రవి కుమార్తె శ్రావణి(23) తిరుపతిలోని ఓ మార్టులో పనిచేస్తోంది. ఈ క్రమంలో పూతలపట్టు మండలం, కమ్మవాండ్లపల్లికి చెందిన కార్తీక్ అక్కడే పనిచేస్తుండడంతో ఇద్దరూ ప్రేమించుకున్నట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం ఇద్దరూ కలసి కోదండరామాపురం సమీపంలోని చిత్తూరుకు వెళ్లే మార్గంలోని సర్వీసు రోడ్డు పక్కన కూర్చున్నారు. కొంత సేపటి తర్వాత శ్రావణి ఏడుస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఆ తర్వాత శ్రావణి తిరుపతి వెళ్లే మార్గంలోని జాతీయ రహదారిపై మృతి చెంది పడి ఉండి ఉంది. మృతురాలితో మాట్లాడిన కార్తీక్ అక్కడ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వారి మధ్య ఏమైనా గొడవలు ఏర్పడ్డాయా.. లేదా కార్తీక్ బెదిరించడంతో అతన్నుంచి పారిపోయే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుందా..? తెలియరాలేదు. చిత్తూరుకు వెళ్లే మార్గంలో కూల్ డ్రింక్, చాక్లెట్లు ఉండడం, తిరుపతికు వెళ్లే మార్గంలో శ్రావణి మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

పోలీసుల అదుపులో యువకుడు!

కార్తీక్‌ను చంద్రగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసలు మృతికి కారణాలు ఏమిటి.. గొడవ ఎందుకు జరిగింది..? అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే తమ బిడ్డను కార్తీక్ బలవంతంగా రహదారిపై తోసేయడంతోనే మృతి చెందిందంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు అది హత్యా.. లేక ఆత్మహత్య అన్న కోణంలో విచారిస్తున్నారు.

కలెక్టరేట్‌లో 'ప్రకృతి వ్యవసాయం'!

అందుబాటులో కూరగాయలు, వర్మీకంపోస్టు ఎరువులు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల కౌంటర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయించుకోవడానికి ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్టు ఆ విభాగం అధికారి షణ్ముగం తెలిపారు. బెంగళూరు నుంచి అజిత్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈఓ హైమావతి కలెక్టరేట్‌లోని ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారని వెల్లడించారు. గత ఐదేళ్లలో వారు రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి సుమారురూ.100 కోట్ల ఖర్చుచేశారని తెలిపారు.

కిలో ఎరువు రూ.15

చేనేత కార్మికులు తాము మగ్గం ద్వారా నేత చీరలతోపాటు అన్ని వస్త్రాలను గ్రీవెన్స్ రోజు కలెక్టరేట్‌లో ఉచితంగా విక్రయించుకునే అవకాశాన్ని గత ప్రభుత్వం కల్పించింది. అయితే ఈ సోమవారం నుంచి తాజాగా వర్మీకంపోస్ట్ ఎరువులను విక్రయించుకునే అవకాశం కల్పించారు. కేజీ వర్మీకంపోస్ట్ ఎరువు రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. ఇది తిరుపతి నగర వాసులకు వరమని చెప్పాలి.

తీరు మారని వైద్యులు



తిరుపతికి రెఫర్ చేసిన స్లిప్పు

శ్రీకాళహస్తి: స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యుల తీరు ఏ మాత్రం మారడంలేదు. ఆదివారం కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్‌గా స్పందించినా పట్టించుకోలేదు. తొట్టంబేడు మండలం కన్నలి గ్రామానికి చెందిన మంజూష అనే గర్భవతి ఈనెల 6న ఆస్పత్రికి వెళ్లారు. అడ్మిషన్ ఇవ్వాలని కోరారు. అయితే పరీక్షించిన అక్కడి వైద్యులు ఈనెల 8న ఆస్పత్రికి రావాలని, అప్పటివరకు ఏమీ ఆహారం తీసుకోవద్దని, సిజేరియన్ చేయాల్సి వస్తుందని చెప్పి పంపించేశారు. ఆ గర్భవతి ఆహారం తీసుకోకుండా సోమవారం ఆస్పత్రికి వెళ్లారు. రక్తపరీక్షలు నిర్వహించి.. ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లే ముందు ఇక్కడ రక్తనిల్వలు లేవని.. తిరుపతికి వెళ్లాలని చేతులెత్తేశారు. వారిచ్చిన రెఫర్ స్లిప్పులో తమ ఇష్ట ప్రకారమే వెళ్తున్నట్టు అందులో రాశారు. దీనిపై నిలదీయగా.. ఆ స్లిప్పులో ఇష్టప్రకారమే అనే మాటను కొట్టేసి మళ్లీ స్లిప్పు ఇచ్చారు. చేసేది లేక తిరుపతికి వెళ్లాల్సి వచ్చిందని గర్భవతి వాపోయారు.

ఏడుగంగల కొలువుకు సర్వం సిద్ధం



ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ఏడు గంగల కొలువుకు సర్వం సిద్ధమైంది. మంగళవారం రాత్రి ముత్యాలమ్మగుడి వీధిలో ఉన్న ఏడు గంగమ్మల అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు.. కుంభం వేసి పూజలు నిర్వహించనున్నారు. తర్వాత ఏడు గంగమ్మలను సిద్ధం చేసి స్థాన ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఆయా స్థానాల్లో గంగమ్మలు కొలువుదీర్చనున్నారు. వీటిలో పెండ్లి మండపం వద్ద పొన్నాలమ్మ, గాంధీ వీధిలో అంకమ్మ, కొత్తపేట వద్ద భువనేశ్వరి, బ్రాహ్మణవీధిలో నల్లగంగమ్మ, జయరామరావువీధి కావమ్మ, భేరివారి మండపం వద్ద ముత్యాలమ్మ, సన్నిధివీధిలో అంకాలమ్మను కొలువు దీర్చనున్నారు. తర్వాత బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గంగమ్మలను భక్తులు దర్శించుకోనున్నారు. సాయంత్రం పొద్దుపోయాక ఏడు గంగమ్మల నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా ప్రాంతాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు సారె సమర్పణ

ఏడు గంగమ్మల జాతరను పురస్కరించుకుని ఆదివారం చాటింపు నిర్వహించారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ఏడుగంగమ్మల అమ్మవారికి మంగళవారం సారె సమర్పించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు.

ఆర్‌బీకేలు, దుకాణాలకు చేరిన యూరియా

సాక్షి ఎఫెక్ట్..



బుచ్చినాయుడుకండ్రిగలోని ఆర్‌బీకేకి చేరిన యూరియా వద్ద ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్‌బీకేలు, దుకాణాలకు యూరియా చేరింది. శనివారం 'సాక్షి'లో 'యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఏఓ భారతి యూరియా సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం మండలంలోని 14 ఆర్‌బీకేలకు 100 టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చింది. మంగళవారం మరో 100 టన్నులు వస్తుందని ఆమె వెల్లడించారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు.